ముగిసిన 'పది' పరీక్షలు

ఆనందంలో విద్యార్థులు

కామారెడ్డి/బీబీపేట్/దోమకొండ/ఎల్లారెడ్డి రూరల్/ పిట్లం/ బిచ్కుంద, మార్చి 30 : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయి. సోషల్ పరీక్ష ఉదయం 9:30 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 62 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. 11,947 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 11,923 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. ప్రైవేట్‌లో ఇద్దరు విద్యార్థులకుగాను ఇద్దరు హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అన్నారు. బీబీపేట బాలుర ఉన్నత పాఠశాలలోని సెంటర్ (ఏ)లో 180 మంది, సెంటర్ (బీ)లో 170 మంది విద్యార్థులు, మాందాపూర్ సెంటర్‌లో 104 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. దోమకొండలోని బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో 162 మంది,బాలికల ఉన్నత పాఠశాలల సెంటర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. శనివారంతో పదో తరగతి పరీక్షలు పూర్తయినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎల్లారెడ్డిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 703 మందికి మొత్తం విద్యార్థులు శనివారం నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో వెంకటేశం తెలిపారు. పరీక్ష అనంతరం విద్యార్థులు కేరింతలు కొడుతూ సెంటర్ నుంచి బయటికి వచ్చారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు లగేజీ సర్దుకొని ఆనందంగా తమ ఇండ్లకు బయల్దేరారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం రద్దీగా మారింది.

ఎల్లారెడ్డిలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థినులు

కామారెడ్డిలో..

పిట్లంలో విద్యార్థినుల ఆనందం

సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న పోచారం

భోగ్‌బండార్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గాంధారి, మార్చి 30: మండలంలోని వెంకటాపూర్ తండాలోని ఉన్న సేవాలాల్ మహరాజ్ ఆలయ 20వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని పౌరాదేవి పీఠాధిపతి బాబూసింగ్ మహరాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భోగ్‌బండార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

ఘన్‌పూర్ వద్ద నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

మాచారెడ్డి, మార్చి 30 : మండలంలోని ఘన్‌పూర్ వద్ద సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.రెండు లక్షల 71 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం తెల్లవారు జామున బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బును పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు ఉంటే సరైన పత్రాలూ వెంట ఉండాలని సూచించారు. ఎస్ఎస్‌టీ అశికారి విద్యాసాగర్‌రావు, ఏఎస్సై యూసుఫ్ తదితరులు ఉన్నారు.

నస్రుల్లాబాద్‌లో రూ.66 వేలు స్వాధీనం

నస్రుల్లాబాద్, మార్చి 30 : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు తీసుకెళ్తున్న సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం ఉత్తనూరు గ్రామానికి చెందిన తిమ్మప్పార్ శ్రీపతి నుంచి రూ.66 వేలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని, ఈ తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నిజాంసాగర్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిజాంసాగర్ మండలంలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో మమ్మరంగా వాహనాల తనిఖీలు కొనసాగిస్తున్నారు. మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద బోధన్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు ఎన్నికల నిబంధనలను పాటించాలని, రూ.50వేలకు మించి డబ్బులు తమ వెంట తీసుకెళ్లేందుకు సంబంధించిన అన్ని ఆధారాలూ ఉంచుకోవాలన్నారు. లేదంటే ఆ డబ్బులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. హైవేపై చెక్‌పోస్టును ఏర్పాటుచేసి నిత్యం వాహనాల తనిఖీ చేపడుతున్నామని తెలిపారు.

గంగమ్మ కోసం భగీరథ ప్రయత్నం

నిజాంసాగర్, మార్చి30: మండలంలోని వెల్గనూర్ గ్రామంలో భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. పది రోజుల్లో పంటలు చేతికి అందే సమయం వచ్చింది. ప్రస్తుతం పంటలకు సాగు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ శివారులోని ఓ బోరుబావిలో భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు ఇలా మరిన్ని పైపులను బిగించి నీటిని పైకి తేవడానికి ఇలా ప్రయత్నిస్తున్నారు.

పైపులను బిగిస్తున్న రైతులు

పరిశుభ్రతపై నిర్లక్ష్యం..

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పట్టణంలోని ఏడో వార్డులో పేరుకుపోయిన చెత్త

పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్యంపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవునిపల్లిలో ఇంటింటా సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియక పంచాయతీ సిబ్బంది ప్రభుత్వ పాఠశాల ఎదురుగా పాడేస్తున్నారు. పలు కాలనీలో మురికి నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్‌లో విలీనం అయినప్పటి నుంచి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొన్నది. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రం చేసి చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– కామారెడ్డి,మార్చి 30

'కోవర్టుల వల్లే అవిశ్వాసం నెగ్గింది'

మాట్లాడుతున్న నిట్టు వేణుగోపాల్‌రావు

కామారెడ్డి, మార్చి 30 : బీఆర్ఎస్ పార్టీలోని కోవర్టుల వల్లే కామారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు అన్నారు. వారి పట్ల గులాబీ శ్రేణులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కామారెడ్డిలోని తన నివాసంలో నిట్టు శనివారం విలేకరులతో మాట్లాడారు. నిట్టు జాహ్నవికి చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కొంత మంది బీఆర్ఎస్‌లో ఉంటూనే కాంగ్రెస్‌కు కోవర్టులుగా పని చేశారని తెలిపారు. 16 మందిని కౌన్సిలర్లను కాపాడుకుని ఉంటే అవిశ్వాసం నెగ్గేది కాదన్నారు. తమను బెదిరించి క్యాంప్‌కు తీసుకెళ్తున్నారని కొంత మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు చెప్పారని, అయినా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ సహకరించ లేదన్నారు. ఈ విషయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కామారెడ్డిలో కేసీఆర్ ఓటమికి కారణం కూడా పార్టీలో ఉన్న కోవర్టులేనన్న అనుమానం వస్తున్నదన్నారు. కోవర్టుల విషయంలో పార్టీ నాయకత్వంతో పాటు జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీ పూర్వవైభవం కోసం కృషి చేస్తానని చెప్పారు. అవినీతిపై గెలిచామని షబ్బీర్‌అలీ అనడం విడ్డూరమని, అవిశ్వాసం నెగ్గేందుకు డబ్బులు ఇచ్చి కౌన్సిలర్లను కొన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ముప్పారపు ఆనంద్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

కామారెడ్డి, మార్చి 30 : జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి గంప గోవర్ధన్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలిఅనిల్ కుమార్ హాజరు కానున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేసేందుకు లింగంపేటలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. లింగంపేటలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నా రు. సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రవీణ్ కుమార్

భిక్కనూరు, మార్చి 30 : మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో సంతోష్‌రెడ్డి ఇటీవల ఏసీబీ అధికారులకు చిక్కారు. ఆయన స్థానంలో ఎంపీవోగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలి

నిజాంసాగర్, మార్చి 30 : జుక్కల్ మండలంలోని మహ్మదాబాద్, బస్వాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. వానకాలం ప్రారంభం నాటికి నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఒక్క మొక్క కూడా ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని కూలీలకు సూచించారు. గిట్టుబాటు ధర వస్తున్నదా అని వారిని అడిగి తెలుసుకున్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత

మాచారెడ్డి, మార్చి 30 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన మిట్టాపల్లి అనూష వివాహానికి లక్ష్మీనర్సింహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల నర్సింహారెడ్డి శనివారం పుస్తె, మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా అనూష తల్లిదండ్రులు శోభ, సదానందం నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసాచారి, లీల, శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు నగదు బహుమతి అందజేత

రామారెడ్డి, మార్చి 30: మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన బేస్త లావణ్య – బలరాం దంపతుల కూతురు మౌనిక వివాహం శనివారం నిర్వహించారు. నూతన వధూవరులకు 1993-94 ఏడో తరగతి బ్యాచ్‌నకు చెందిన బలరాం మిత్రులు రూ.55వేల నగదు బహుమతిని అందజేశారు. వివాహ వేడుకల్లో బలరాం మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

బిచ్కుంద, మార్చి 30: మండలంలోని పెద్ద తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మహేశ్ ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందిందని ఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. మహేశ్ పని నిమిత్తం తూఫ్రాన్‌కు వెళ్లి తిరిగి రాలేదన్నారు. వారం రోజులుగా ఆచూకీ లభించకపోవడంతో అతడి అత్త నాగుర్ లక్ష్మి ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మహేశ్ ఆచూకీ తెలిసిన వారు 8712686176 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

వేతనాలు చెల్లించాలని వినతి

బాన్సువాడ టౌన్, మార్చి 30 : నాలుగు నెలలుగా బకాయిలు ఉన్న శానిటేషన్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐసీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బాస్ రాములు తెలిపారు. బాన్సువాడ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ కార్మికులతో కలిసి ఆర్డీవో కార్యాలయ డీఏవో సువర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ మాతా శిశు, ఏరియా దవాఖానలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్ టేకర్, సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు లేవని, సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా వెంటనే జీతాలు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రేణుక, సురేఖ, భారతి, వినోద, లక్ష్మి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియ చేయునది ఏమనగా, మా క్లయింట్ శ్రీ ఆకుల నర్సింలు తండ్రి ఆకుల రాజయ్య, 70 సం॥లు, వృత్తి: రిటైర్డ్ ఉపాధ్యాయుడు, నివాసం: ఇ.నెం. 5-3-503, నిజాంసాగర్ రోడ్ కామారెడ్డి పట్టణం జిల్లా గారికి సంబంధించిన డాక్యుమెంట్ నెం. 2928/2016.ఎస్.ఆర్.ఓ. కామారెడ్డిలో రిజిష్టర్ అయినది. దొరకకుండా పోయినది. ఇట్టి విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనైనది. కావున ఇట్టి డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో నా క్లయింట్‌కు గాని లేదా నాకు అంద చేయగలరు. ఇట్టి ఆస్థికి ఎవరికైనా, ఎటువంటి అభ్యంతరము ఏ విధమైన హక్కుగాని ఉన్నచో వెంటనే తెలుపగలరు. షెడ్యూలు ఆస్తి వివరాలు ఓపెన్ ప్లాట్, సర్వే నెం.86/6లో కొలతలు మొత్తం విస్తీర్ణం 200 చదరపు గజములు **దీని హద్దులు తూర్పు:** రైల్వే బౌండరి, **పడమర:** నాగ్‌పూర్ రోడ్, **ఉత్తరం:** అమ్మినవారి ప్లాటు, **దక్షిణం:** సునీల్ కుమార్ ప్లాటు. జి.పి. పాత రాజంపేట్ గ్రామ శివారు కామారెడ్డి మండలం, జిల్లా తెలంగాణ రాష్ట్రం.

సం/- బి.నాగభూషణం, న్యాయవాది, నోటరీ
వి.వి కాలనీ, కామారెడ్డి, సెల్:9533660808

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

డోంగ్లీ, మార్చి 30: మండలంలోని ఇలేగావ్, కుర్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు శనివారం ప్రారంభించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఏఈవో సమ్రిన్ తెలిపారు. క్యాక్రమంలో విండో కార్యదర్శి గంగాధర్, సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్

కామారెడ్డి,మార్చి 30: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలపై చిన్నచూపు చూస్తోన్నదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపించారు. మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రామస్వామి, కౌడి భూపతి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

నిజాంసాగర్, మార్చి 30: కార్యకర్తలు సమయ పాలనపాటిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి సూచించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన సెక్టార్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజూ కేంద్రాలను సమయానుసారం కొనసాగించాలని, కేంద్రాలకు చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ హాజరయ్యేలా చూడాలన్నారు. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి రాకుంటే, ఆయాను వారి ఇంటికి పంపించి కేంద్రానికి తీసుకువచ్చే ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతోపాటు కేంద్రానికి వచ్చే సరుకుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ **Experienced Supervisors Needed.** 1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.
NT-10287-All

CHANGE OF NAME

★ I, VIJAYA KUMAR SURINENI, S/o. Srinivas Rao Surineni, R/o. 7-68, Ethonda Camp, Kotagiri Mandalam, Ethonda, Nizamabad, TS-503 207. Changed My Name VIJAY KUMAR SURINENI, S/o. Srinivas Rao Surineni.
NT-328953

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

మహాజన సభలో రైతుల వేడుకోలు

పిట్లం, మార్చి 30: పిట్లం-చిల్లర్గి సహకారసంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలుకేంద్రం ఏర్పాటు చేసి ఆదుకోవాలని సంఘం పరిధిలోని రైతులు కోరారు. పిట్లం-చిల్లర్గి సహకారసంఘం మహాజన సభను రాంపూర్ సహకార సంఘ భవనంలో చైర్మన్ శపథంరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో సీఈవో సంతోష్‌రెడ్డి సంఘ నివేదికను చదివి వినిపించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. రూ.రెండు లక్షల రుణమాఫీని వెంటనే ప్రకటించాలని, టార్పాలిన్లను కొనుగోలు చేసి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. చిల్లర్గి గ్రామంలో ఉన్న సహకార సంఘం స్థలంలో సిమెంట్ స్తంభాలతో కంచెను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ కోరారు. సమావేశంలో విండో డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ సొసైటీలో..

బాన్సువాడ టౌన్, మార్చి 30 : బాన్సువాడలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో 110వ మహాజన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సొసైటీ సీఈవో నారాయణరెడ్డి జమా ఖర్చులను ప్రజలకు, పాలకవర్గ సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అన్ని రకాల రుణాలను వందశాతం వసూలు చేయడంలో బాన్సువాడ సొసైటీ జిల్లాస్థాయిలో ముందంజలో ఉందని అన్నారు. ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. రూ.500 బోనస్‌తో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. బాన్సువాడ సొసైటీ భవన నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు అందించినందుకు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి పాలకవర్గం, రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, లింగమేశ్వర్, నర్సగొండ, సొసైటీ పాలకవర్గం సభ్యులు, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి సహకారించాలి

బాన్సువాడ రూరల్, మార్చి 30 : రైతులు తీసుకున్న దీర్ఘ, స్వల్ప కాలిక రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలని బుడ్మి సహకార సంఘం అధ్యక్షుడు గంగారాం రైతులకు విజ్ఞప్తి చేశారు. దేశాయిపేట్, బుడ్మి సహకారం సంఘాల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం ఆదాయ, వ్యయాలను కార్యదర్శులు సభలో వివరించారు. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. యాసంగి వరి పంట చేతికొచ్చిన తరుణంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లలకు సకాలంలో తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, అంబర్‌సింగ్, కార్యదర్శి కృష్ణమయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో మాట్లాడుతున్న చైర్మన్ శపథంరెడ్డి

బాన్సువాడలో పాల్గొన్న రైతులు..

దేశాయిపేట్‌లో పాల్గొన్న రైతులు..